క్లుప్తంగా

సంతృప్త స్థాయిలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

నంద్యాల(సెంట్రల్): నంద్యాల సబ్‌డివిజన్‌లో అన్నదాతలకు సంతృప్త స్థాయిలో పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఖరీఫ్‌నకు సంబంధించి మొత్తం 6 మండలాలకు గాను అదనపు కేటాయింపులతో కలిపి 1377 క్వింటాళ్ల జీలుగ, 200 క్వింటాళ్ల పిల్లిపెసరను పంపిణీ చేశామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నమోదు చేసుకున్న అన్నదాతలకందరికీ 50 శాతం రాయితీతో అందజేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా విత్తనాల నాణ్యతలో లోపాలుంటే స్థానిక వ్యవసాయ సహాయకులకు తెలియజేసి మార్చుకునే అవకాశం కల్పించామన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి



వినతి పత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): జమ్ముకశ్మీర్‌లో యాత్రికులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శేషశాయి కలెక్టర్ సీసీకి బుధవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్‌లోని వైష్ణోదేవి దేవాలయాన్ని దర్శించుకుని వస్తున్న భక్తులపై తీవ్రవాదులు కాల్పులు జరిపిన ఘటనలో పదిమంది యాత్రికులు మరణించారని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు చంద్రశేఖర్, నాగిరెడ్డి, చింతలపల్లె వాసు, కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రభాకర్ రెడ్డికి కుప్పం రెడ్డమ్మ అవార్డు



ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాలకు చెందిన సీనియర్ జర్నలిస్ట్, రచయిత కాశీపురం ప్రభాకర్ రెడ్డికి కుప్పం రెడ్డమ్మ స్మారక రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. ప్రభాకర్ రెడ్డి రాసిన 'మేడం. సి' అనే నవలకు గాను అవార్డు అందజేశారు. బుధవారం చిత్తూరులో చిత్తూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రెడ్డమ్మ ట్రస్ట్ అధ్యక్షురాలు డా కె. రామలక్ష్మి అవార్డును అందజేసి సత్కరించారు. క్రికెట్ నేపథ్యంలో వచ్చిన ఈ నవలలో రాయలసీమ సంస్కృతి గొప్పదనాన్ని అద్భుతంగా వివరించారని వక్తలు పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

గోస్పాడు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయారావు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో బుదవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 117 రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో ఉన్న 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో కలపాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, భోధనకు అడ్డంకిగా మారిన అన్ని రకాల యాప్‌లు రద్దు చేయాలని కోరారు. ఉపాధ్యాయ బదిలీలు మ్యానువల్ పద్ధతిలో చేపట్టాలని, అంతర్ జిల్లా బదిలీలు నిర్వహించాలన్నారు. అలాగే..12వ పీఆర్సీ ప్రకటించి అంతవరకు మధ్యంతర భృతి అందించాలన్నారు. పీఆర్టీయూ నాయకులు సుబ్బరాయుడు నాయక్, శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

అయోడిన్ తక్కువ ఉన్న ఉప్పు హానికరం



ఉప్పు నమునాలను ల్యాబ్‌కు పంపేందుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

చాగలమర్రి: అయోడిన్ శాతం తక్కువ ఉన్న ఉప్పు వినియోగించడం హానికరమని, దీని వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతారని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ ఇమ్రాన్ తెలిపారు. బుధవారం ఆయన వైద్యశాలలో మాట్లాడుతూ ప్రజలు సముద్రపు ఉప్పు వినియోగించి రోగాల బారిన పడుతున్నారని, ఉప్పులో అయోడిన్ తగిన శాతం కలిగి ఉండాలన్నారు. మండలంలో దుకాణాల నుంచి ఉప్పు నమూనాలు సేకరించి జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌కు పంపుతున్నామన్నారు. వాటి ఫలితాల నివేదికలను తమకు అందజేస్తారని చెప్పారు. నాసిరకం ఉప్పు వాడకం వల్ల వివిధ రాకాల వ్యాధులు సంభవించే అవకాశం ఉందని చెప్పారు. అయోడిన్ ఉన్న ఉప్పును మాత్రమే వినియోగించాలని సూచించారు.

ఎడతెరిపి లేకుండా వర్షం



కుందూలో ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న వర్షపునీరు



మాచినేనిపల్లె వద్ద పొలాల్లో తొలగని వర్షపు నీరు

దొర్నిపాడు: రెండు రోజులుగా విరామం లేకుండా కుండపోతగా వర్షం కురస్తుండటంతో వాగులు, వంకలు పొంగుతుండగా, కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. క్రిష్టిపాడు సమీపంలో కుందూ నదిపై నిర్మించిన వంతెనను ఆనుకొని ప్రవహిస్తుంది. ఇప్పటికే ఖరీఫ్ సాగుకు రైతులు వేసవి దుక్కులు చేసుకొని సిద్ధంగా ఉన్నారు. నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలకు గడ్డి పెరిగిపోయి పొలాలు బీళ్లయ్యే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

రుద్రవరం: మండలంలో నాలుగు రోజులుగా వీడకుండా వర్షం కురుస్తోంది. దీంతో వాగులు,వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. అలాగే పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో పంట సాగు పనులు ముందుకు సాగక పోగా ఇదివరకే సాగు చేసిన వివిధ పంటలు మునిగి పోయాయి. పైర్లు దెబ్బతిన కుండా పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. అలాగే గ్రామాల్లోని పలు కాలనీలు, ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వర్షం కురవడంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నీరు నిల్వ చేరింది. నర్సాపురం, చిత్రేనిపల్లె, ముకుందాపురం, మందలూరు, చిలుకలూరు, పేరూరు,కొండమాయపల్లె తదితర గ్రామాల్లోని పలు కాలనీలు జలమయమయ్యాయి.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు



రుద్రవరం నుంచి వాహనంలో పాఠ్య పుస్తకాలను తరలిస్తున్న దృశ్యం

రుద్రవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం ఎంఈఓ లక్ష్మీ పాఠ్య పుస్తకాల పంపిణీ చేపట్టారు. సెలవులు పూర్తయ్యి గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో విద్యార్థులకు అందించేందుకు ఆయా పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలను సిద్ధం చేస్తున్నామని ఆమె తెలిపారు. ఇదివరకే ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్య పుస్తకాలను రుద్రవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని ఓ గదిలో భద్ర పరచామని ప్రస్తుతం వాహనం ద్వారా ఆయా గ్రామాల పాఠశాలల హెచ్‌ఎంలకు అప్పగిస్తున్నామని చెప్పారు. గురువారం వారు పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తారన్నారు.సీఆర్పీలు రామయ్య,శ్రీను ఉన్నారు.



పాఠశాలలకు పుస్తకాలను తరలిస్తున్న ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు

పాఠశాలలకు పుస్తకాలు

గోస్పాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మంజూరైన నోట్, పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలలకు పంపుతున్నట్లు ఎంఈఓలు అబ్దుల్ కరీం, సురేంద్రనాథ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రం నుంచి పాఠశాలలకు నోట్, పాఠ్యపుస్తకాలు పంపారు. వారు మాట్లాడుతూ మండలంలో 32 ఎలిమెంటరీ, ఒక యూపీ, 5 హైస్కూళ్లున్నాయని, వాటిలో 9 ఎలిమెంటరీ, ఒక యూపీ, 5 హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు అందజేసినట్లు చెప్పారు. 3,4,8,9 తరగతులకు పూర్తి స్థాయిలో పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. మిగిలిన తరగతులకు పుస్తకాలు అందిన వెంటనే పంపుతామన్నారు.

మహానందిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మహానంది : మహానందీశ్వరుడి సన్నిధిలో పల్నాడు జిల్లాకు చెందిన వీరభద్ర భజనమండలి కళాకారులు బుధవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కాకాని అంజయ్య ఆధ్వర్యంలో కళాకారులు భజనలు చేశారు. ఓం నమఃశివాయ, హర హర మహాదేవ లాంటి ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తూ నిర్వహించిన భజన ప్రదర్శన భక్తులకు ఆధ్యాత్మిక ఆనందానికి గురిచేసింది.

కుమారస్వామికి షష్టి పూజలు



కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో బుధవారం షష్టి సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందన



ఉద్యోగులకు మెగా చెక్కును అందజేస్తున్న డిపో మేనేజర్ మహేంద్రుడు

ఆత్మకూరు: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్ ఆవరణలో బుధవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మహేంద్రుడు డిపోలో మే నెలలో 85 ఓఆర్ సాధించి, రాష్ట్రంలో మూడో స్థానం, జోన్‌లో ప్రథమ స్థానం సాధించినందుకు గానూ ఉద్యోగులందరినీ అభినందించారు. మే నెలలో అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు కె.గోవిందయ్య, జి.ఆర్.ఎల్. రెడ్డి, ఎంఎం బాషా, ఎస్.ముర్తుజాబీ, ఎస్.ఎస్.బాషా, కె.ఎస్.రావు, పి.మహేశ్వరి, జి.సి.నాగమ్మలను, అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు పి.దర్గయ్య, ఎస్.కె.వలి, ఎం.ఎస్.నాయక్, బీఎండీ రఫీక్, పీఆర్‌సీ రెడ్డి, ఎం.కలిముల్లాలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఐ కోటయ్యనాయక్, కంట్రోలర్ ఎం.ఎం.బాషా, షఫీవుల్లా, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి వెండిమాల విరాళం



అర్చకుడికి వెండి మాల అందజేస్తున్న మోహన్‌రావు

బనగానపల్లె రూరల్ : మండలంలోని పలుకూరులో వెలసిన ఎనకండ్ల ఆంజనేయస్వామికి గ్రామానికి చెందిన మోహన్‌రావు సుమారు రూ.15 వేల విలువ వెండిమాలను విరాళంగా అందజేసినట్లు ఆలయ అర్చకులు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. దాతను జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి అభినందించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన కేతు వెంకటసుబ్బయ్యగౌడ్, మహేష్, ఆంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్ : స్థానిక కోర్టు భవనంల ఆవరణలో ఈ నెల 29వ తేది నిర్వహించే జాతీయ లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. లోక్ ఆదాలత్‌పై స్థానిక కోర్టులో బుధవారం సాయంత్రం పట్టణంలోని వివిధ బ్యాంక్ మేనేజర్లు, అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బ్యాంకులు, విద్యుత్, టెలిఫోన్ తదితర శాఖల రుణాలు, బిల్లులు తిరిగి చెల్లించని వారిని గుర్తించి లోక్ ఆదాలత్‌లో ప్రవేశపెట్టి పరిష్కరించుకోవాలని సూచించారు. బకాయిల వసూలుకు మార్గాలు సుగమం చేసుకోవాలన్నారు. సమావేశంలో కోర్టు సిబ్బంది సరిత, కల్యాణి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించండి



వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నంద్యాల టౌన్: నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు క్రమం తప్పకుండా చెల్లించాలని, అలాగే మార్చి, ఏప్రిల్, మే నెలకు సంబంధించిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయమ్మకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మూడు నెలలు నుంచి జీతాలు అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే ప్రావిడెంట్ ఫండ్, కార్మికుల బీమా చెల్లింపు సక్రమంగా అమలు చేయకుండా అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టం ప్రకారం వారికి కనీస సౌకర్యాలు, యూనిఫాం, వారాంతపు సెలవు, పండుగ, జాతీయ సెలవులు, 15 వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు సుశీలమ్మ, కార్మికులు రాణి,లక్ష్మి, సావిత్రి పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల అర్బన్: పట్టణంలో గురువారం నుంచి శుక్రవారం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడవచ్చని నంద్యాల ఏపీ ట్రాన్స్‌కో ఈఈ రమణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని క్రాంతి నగర్‌లో ఉన్న 220 కేవీ సబ్ స్టేషన్‌కు ప్రధాన సరఫరా కేంద్రమైన 220 కేవీ సోమయాజుల పల్లె స్విచ్చింగ్ స్టేషన్లో ఒక సర్క్యూట్ ఎస్‌వై పల్లి -1 ఫీడర్ మరమ్మతుల కారణంగా ఒకలైన్ మాత్రమే సరఫరా ఉంటుందన్నారు. ఈ లైన్‌లో అంతరాయం కలిగితే పట్టణ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం కలిగే అవకాశం ఉంటుందన్నారు. ఆలాంటి ఇబ్బందులు లేకుండా ఏపీ ట్రాన్స్‌కో అన్ని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలి

రుద్రవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు 90 శాతం రాయితీపై నాణ్యమైన విత్తనాలు అందించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కొమ్ము భాస్కర్, రైతు సంఘం మండల నాయకులు బాలనరసింహులు కోరారు. అలాగే కల్తీ ఎరువులు,నకిలీ పురుగు మందులు విక్రయించకుండా షాపులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు మురళీమోహన్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సీజన్ మొదలు కావడంతో ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలను నామ మాత్రంగా కాకుండా పూర్తిస్థాయిలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు ఎరువుల దుకాణాలను తనిఖీలు చేయాలని, అక్కడ స్టాకు, ధరల పట్టిక ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సుబ్బరాయుడు ఉన్నారు.

రెసిడెన్షియల్ పాఠశాలలకు కిట్లు పంపిణీ

పాణ్యం: మండలంలోని పది రెసిడెన్షియల్ పాఠశాలలకు వచ్చిన విద్యాకానుక కిట్లను ఆయా పాఠశాలలకు పంపిణీ చేసినట్లు ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం తెలిపారు. మిగిలినవి త్వరలోనే వస్తాయని చెప్పారు. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బెల్ట్, షూతో కూడిన కిట్లను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న లీగల్ సెల్ సభ్యులు

బాలలను పనిలో పెట్టుకోవడం నేరం



మాట్లాడుతున్న రాజేశ్వరమ్మ

నంద్యాల(న్యూటౌన్): బాలలను పనిలో పెట్టుకోవడం నేరమని, ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ ఫెడరేషన్ కార్యదర్శి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యురాలు ఎరుకలి రాజేశ్వరమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని స్టార్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 6 – 14 సంవత్సరాల లోపు పిల్లలను ప్రమాదకరమైన పనులలో యజమానులు పెట్టుకుంటే చర్యలు తప్పవన్నారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని, ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. సొసైటీ కార్యదర్శి గడ్డం సుబ్బరాయుడు, రాజు, సంపత్ కుమార్, నాగలక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

నంద్యాల (వ్యవసాయం): బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి బాలలకు మంచి భవిష్యత్‌ను కల్పించాలని లేబర్ ఆఫీసర్ బషీరున్నీసా బేగం పేర్కొన్నారు. బుధవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం న్యావాదులు పెద్దస్వామి, శేషశాయి మాట్లాడుతూ బాల కార్మికులను గుర్తించి వారికి నాణ్యతతో కూడిన ఉచిత విద్యను అందించి, అన్నివసతులను కల్పించి సంపూర్ణంగా బాల కార్మికవ్యవస్థను నిర్మూలించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి సంజీవ నగర్ వరకు చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఓబుల్‌రెడ్డి, మధు, నాయక్, మండల లీగల్ సెల్ సిబ్బంది రామచంద్రారెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

నూతన భవనం నిర్మించరూ!



శిథిలావస్థకు చేరిన నంద్యాల మండల ఎంఈఓ కార్యాలయ భవనం



భవనం లోపలి భాగంలో పెచ్చులూడుతున్న పైకప్పు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని నంద్యాల మండల ఎంఈఓ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. దశాబ్దాల క్రితం ఏర్పాటైన భవనం కావడం, మరమ్మతులకు నోచుకోక పోవడంతో భవనం పైకప్పు పెచ్చులూడి పడుతోంది. ఇక వర్షాకాలంలో పైకప్పు వెలుస్తుండటంతో విధులు నిర్వహించేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అలాగు ముఖ్యమైన ఫైళ్లు తడిచిపోకుండా ఉండేందుకు అవస్థలు పడుతున్నారు. సంబంధిత శాఖకు చెందిన రికార్డులు, కంప్యూటర్లను భద్రపరచుకోవడానికి సిబ్బందికి నానా ఇక్కట్లు పడుతున్నారు. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బంది కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం



గంధాన్ని ఉరేగింపుగా తీసుకెళ్తున్న పీఠాధిపతి అబ్దుల్‌హక్

చాగలమర్రి: స్థానిక చెరువు కట్టపై వెలసిన దస్తగిరి స్వామి గంధం కార్యక్రమాన్ని దర్గా కమిటీ సభ్యులు బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాత బస్టాండు వీధిలోని ముల్లా మౌలాలి ఇంటి నుంచి వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన పీఠాధిపతి అబ్దుల్‌హక్ స్వామి వారికి గంధాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా దర్గా వరకు తీసుకెళ్లి, స్వామి వారికి సమర్పించి, ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. శెట్టివీడు, చాగలమర్రికి చెందిన దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కాగా గంధోత్సవానికి భక్తులు భారీగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వ ఆస్తులపై ప్రత్యేక దృష్టి

పగిడ్యాల: 2024 ఎన్నికల ఓట్ల లెక్కింపు అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయ భవనాలు, యూనివర్సిటీలు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడి విధ్వంసం సృష్టిస్తున్న సంగతి పాఠకులకు విధితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్తులు విధ్వంసానికి గురికాకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయ భవనాలను పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు రావడంతో పోలీస్ శాఖకు లెటర్ పెట్టామని, వీఆర్వోలకు నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ బాట



క్రిష్టిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



నర్సాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు, తల్లిదండ్రులు

రుద్రవరం: మండలంలోని నర్సాపురంలో బుధవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో సిబ్బంది, చిన్నారులు,వారి తల్లిదండ్రులతో అంగన్‌వాడీ బాట ర్యాలీ, బాల సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ బాట, బాలసభ కార్యక్రమాన్ని 10– 18ఏళ్ల లోపు బాల బాలికలతో నిర్వహించామన్నారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని వారికి పౌష్టికాహారంతో పాటు ఆట,పాట,సృజనాత్మకత సంసిద్ధత, కార్యక్రమాల ద్వారా శారీరక, మానసిక, మేధోబివృద్ధి పెంపొదించబడతాయని చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యకర్తలు సనీత,సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

దొర్నిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్-2లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యకర్త మార్తమ్మ, గ్రామ హెల్త్‌సెక్రటరీ మాణిక్యమ్మ, ఆశా వర్కర్లు విజయలక్ష్మి, లక్ష్మి, ఆయా సుశీలమ్మ పాల్గొన్నారు.

శిరివెళ్ల: గోవిందపల్లెలో బుధవారం అంగన్‌వాడీ బాట కార్యక్రమం జరిగింది. వర్కర్లు ఇంటింటికీ వెళ్లి చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించమని ప్రచారం చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రషీదాబేగం మాట్లాడుతూ ఇప్పటి వరకు 15 మంది చిన్నారులను కేంద్రాల్లో చేర్పించామని చెప్పారు.

నంద్యాల(అర్బన్): అంగన్‌వాడీ చదువు భవిష్యత్‌కు పునాది వంటిదని నంద్యాల అర్బన్ ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ, సూపర్‌వైజర్ నజీర తెలిపారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుదవారం పట్టణంలోని 2,3 సెక్టార్ల పరిధి కేంద్రాల్లో అంగన్‌వాడీ బాట -బంగారుబాటపై తల్లులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆటపాటల విద్యతో పాటు పౌష్టిక ఆహారాన్ని అందించే అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్లు నిండిన చిన్నారులను చేర్పించాలని కోరారు. సుజాత, టీచర్లు సుశీలమ్మ, రాజేశ్వరి, రత్నాలు, జమృత్, అమిదాబీ, లక్ష్మీదేవి, శారదమ్మ, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల విజేత పెద్దకందుకూరు ఎద్దు



ఒంటెద్దు రాతి దూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

చాగలమర్రి: స్థానిక చెరువు కట్టపై వెలసిన శ్రీదస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా బుధవారం ఒంటెద్దు రాతి దూలం లాగుడు పోటీలను దర్గా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో 22 వృషభాలు పాల్గొన్నాయి. విజేతలుగా నిలిచిన మొదటి 8 ఎద్దులకు దాతల సహకారంతో నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన పెద్దకందుకూరు గ్రామానికి చెందిన ఎద్దుకు రూ.10వేలు, రెండో బహుమతిని ఎద్దు యజమానికి రూ.8వేలు, ఆ తరువాత వరుసగా..మైదుకూరు, కడప, ప్రొద్దుటూరు తదితర ఎద్దులకు రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2,500, రూ.2వేలు, రూ.వెయ్యిని మాజీ సర్పంచ్ అన్సర్‌బాషా, నిర్వాహకులు ముల్లా మౌలాలి, హనీఫ్ అందజేశారు.